


# కాలింగ్ బెల్ ఓట్రు ప్రకాష్ రావు

సోమయాజులు ఉలిక్కి పడి లేచాడు. పైన ఫ్యాన్ వేగంగా తిరుగుతున్నా ముఖాన చెమట పట్టడం గమనించాడు. సమయం ఒంటిగంట అయింది. 'ఇక తలకిందులుగా తపస్సు చేసినా నిదుర రాదు' అని మనసులో బాధగా అనుకొన్నాడు .

ఏమిటో ఈ మధ్య ప్రతిరోజూ పీడ కలలు రావడం... రాత్రి వేళ ఒకటి లేక రెండు గంటల సమయంలో ఉలిక్కి పడి లేవడం ఆతరువాత నిదుర రాక అసహనంగా పిచ్చి పిచ్చి ఆలోచనలతో అటూ ఇటూ మంచంపై పొర్లుతూ క్షణం ఒక యుగంలా ...... ఈ సమస్య ఎవరితో చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

ఒక రోజు భార్య సావిత్రి అన్న మాటలు గుర్తుకు తెచ్చుకొన్నాడు .

"మనిద్దరిలో ఎవరు ముందుగా మరణిస్తారో వారే అదృష్టవంతులు "అంది సావిత్రి

"అదేమిటి సావిత్రీ మనమిద్దరమూ ఎవరూ లేని ఆనాథలు అయినట్లు మాట్లాడుతున్నావు. మనల్ని ప్రేమించే ఇద్దరు కొడుకులు , ఒక కూతురుఉన్నారన్న సంగతి మరిచావా?. వాళ్ళు మనకు కాస్తా దూరంగా అంటే, కొడుకులిద్దరూ విదేశంలో ఉంటె, కూతురు పెళ్లైయ్యాక అల్లుడు ఉద్యోగరీత్యా ముంబైలో స్థిరపడ్డారు. ఇప్పటికీ మనతో ప్రతిరోజూ ఫోన్లో మాట్లాడుతున్నారుగా" అన్నాడు

" ఏమి మాట్లాడుతున్నారో ....మనమై వాట్స్ అప్ ద్వారా ఫోన్ చేయడం వల్ల మాట్లాడుతున్నారు. మనం ఫోన్ చెయ్యకుండా ఉంటే వారానికి ఒకసారి మాట్లాడుతారు. ఈ కాలం పిల్లలలంతా మారిపోయారు. విదేశాల్లో వున్నా ఒకటే, పక్క ఊరిలో వున్నా ఒకటే...ప్చ్ " అంది సావిత్రి .

సావిత్రి మరణించి ఆరునెలలు అయింది. సావిత్రి మరణించాక ఈ మధ్య సోమయాజులతో రెండువారాలకొకరోజు ఫోన్ చేసినా ఒకటి రెండు నిమిషాల పైన మాట్లాడకపోవడం సోమయాజులు గుర్తించి మౌనంగా బాధపడ్డాడు.

కొంత సేపు సావిత్రీ ఆలోచనలలో మునిగిపోయాడు .మరికొంత సేపు ఈ ఒంటరితనం ఎలా భరించాలన్న ఆలోచనలో పడ్డాడు . మనసులో ఏదో తెలియని శూన్యం........ నిదురరాక .... 'ప్చ్..... ఒంటరితనం జీవితం ఎంతటి నరకమో ' అనుకొన్నాడు సోమయాజులు

ఆరుగంటలకు పాలవాడి కేక. పాలగిన్నె తీసుకొని తలుపులు తెరిచాడు

"సార్ మీరొక్కరే నేను ఒక కేక వేయగానే తలుపులు తెరచి పాలు తీసుకొంటున్నారు ప్రతి ఇంటిలోనూ పాలు తీసుకొనడానికి చాలా ఆలస్యం చేస్తున్నారు. పాల సైకిల్ స్టాండ్ వేసి కాలింగ్ బెల్ కొట్టి పిలుస్తున్నాను " అంటూ పాల గిన్నెలోపాలు పోసాడు .

సోమయాజులు వాడి వైపుచూస్తూ జీవం లేని నవ్వు నవ్వాడు 'వాళ్లంతా అదృష్టవంతులు హాయిగా నిదురపోతున్నారు,నేను దురదృష్టవంతుడ్ని 'అని మనసులో అనుకొంటూ లోనికి వెళ్ళాడు.

★★★ ★★★ ★★★

హోటల్ ముందు తగిలించి ఉన్న పెద్ద బ్యానర్ కనపడింది . 'సర్వ సమస్యలకు , మానసికాందోళనలకు పరిష్కారమార్గమైన ధ్యానం నేర్పించబడును.రిసిప్షన్ హాలులో జరిగే పరిచయ కార్యక్రమమునకు అందరూ ఆహ్వానితులే' అంటూ పెద్ద అక్షరాలతో ప్రింట్ చేసి వుంది.

ఆ పరిచయ కార్యక్రమమునకు సోమయాజులు వెళ్ళాడు. అరవై వయసుకు అటూ ఇటూ ఉన్న ఆడవారు మగవారు మొత్తం కలిపి ఇరవై మంది ఉన్నారు. పట్టణమంతా ప్రకటనలు ఇచ్చినా చాలా తక్కువగా ఇరవైమంది మాత్రమే వచ్చారంటే సోమయాజులుకు ఆశ్చర్యం కలిగించింది

ధ్యాన గురువు మాట్లాడుతూ మనసు గురించి ఎన్నోవిధాల చెప్పారు ' ఎటువంటి చెడు ఆలోచనలు కలగకుండా ప్రశాంతంగా నిదురించాలంటే ఈ ధ్యానం అభ్యసిస్తే చాలు "అన్న మాటలు సోమయాజులు మనసులో నిలచిపోయింది ఆ క్షణమే ఆ తరగతిలో చేరాలని నిర్ణయించుకొన్నాడు

అతని ప్రసంగం ముగించడానికి ముందు "మొత్తం ఐదు రోజులు ఈ తరగతులు జరగుతుంది. ఈ తరగతులలో చేరడానికి మనిషికి పదిహేను వేల రూపాయలు ఫీజు నిర్ణయించాము. తరగతులలో చేరవలసిన వారు డబ్బు చెల్లించి తమ పేరు నమోదు చేసుకోండి " అన్నారు .

ఐదురోజుల ధ్యానం తరగతులు ముగిసింది.

‘ ఈ ధ్యానం వల్ల తనకు ఎటువంటి ప్రయోజనం లేదు. వీళ్ళు నిజమైన ఆధ్యాత్మిక గురువులు కాదు వ్యాపార గురువులు. పదిహేనువేలరూపాయలు వృధా అయింది ' సోమయాజులు అనుకొన్నాడు.

★★★ ★★★ ★★★

హనుమంతుని గుడి దగ్గర ఒక చిన్న ప్రకటన సోమయాజులు చూసి చదివాడు ."ఉచిత యోగా విద్య హనుమంతుని గుడిలో ఈ రోజు నుండి ప్రారంభం కానుంది .ఆసక్తి కలవారు యోగ విద్యను అభ్యసించి వాటి ఫలితాలను పొందగలరని ఆశిస్తున్నాము "

సావిత్రీ మరణించడానికి ముందు ప్రతి వారం హనుమంతుని గుడికి భార్యతో కలసి సోమయాజులు వెళ్ళేవాడు. ఆ తరువాత మనసు ఏకాగ్రత లేక పోవడంతో గుడికి వెళ్లడం మానుకున్నాడు. ఈరోజు మరలా గుడిలోకి సోమయాజులు ప్రవేశించాడు. అప్పటికే యోగాసనం విద్యా తరగతులు ప్రారంభమైంది. సూర్య నమస్కారములు చేయిస్తున్నారు .

సుమారు యాభై సంవత్సరాల వయసుతో పొడుగాటి గడ్డం, నుదుట కుంకుమతో తెల్లటి దుస్తులు ధరించిన ఆ వ్యక్తిని చూడగానే అతనే యోగా గురువు ఉండవచ్చు అని అనుకొన్నాడు సోమయాజులు

" నమస్కారం అండీ ...నేను యోగా మాస్టర్ ను కలవడానికి వచ్చాను "

"నమస్కారం అన్నా ,యోగా గురించి నాకు తెలిసింది కొద్దిగా అయినా నన్ను యోగ మాస్టర్ అంటుంటారు. నా పేరు దాసు " అన్నారు

సోమయాజులు తన భార్య మరణం తరువాత తన మానసిక ఆందోళనగురించి క్లుప్తంగా చెప్పాడు. ధ్యానం తరగతులకు వెళ్లి ఎటువంటి ప్రయోజనం కలుగలేదన్నా సంగతి చెప్పిన తరువాత "అయ్యా , యోగాసనములు ద్వారా నా సమస్య కు పరిష్కారమార్గం దొరుకుతుందన్న ఆలోచనతో అక్కడున్న ప్రకటన చూడగానే వచ్చాను"అన్నాడు సోమయాజులు

"అన్నా,చూడటానికి మీ వయసు సుమారు డెబ్బై నుండి డెబ్బై ఐదు సంవత్సరాల వయసు ఉంటుందనుకొంటున్నాను " అన్నారు దాసు

" డెబ్బై ఐదు " సమాధానం ఇచ్చాడు సోమయాజులు

" క్షమించండి అన్నా యోగా తరగతులకు చిన్న పిల్లలకు మీలాంటి పెద్ద వారికి నేను నేర్పించను .నా దృష్టిలో చిన్న పిల్లలు, ముసలివారు జోడు గుర్రాలు లాంటి వారు . వారిద్దరూ సమానం. యోగా తరగతులు ఎలా జరుగుతుందో మీరు చూడండి .ఇక మీ మానసిక సమస్య ...." అంటూ ప్రారంభించబోతుంటే "అయ్యా క్షమించండి తరగతి మధ్యలో వచ్చి

మిమ్మల్ని .....మీరు యోగా తరగతులను నిర్వహించండి ,అవసరమనిపిస్తే మరలా వస్తాను " అంటూ చేతులు జోడించాడు సోమయాజులు

దాసు తరగతులు జరపడం ప్రారంభించగానే సోమయాజులు వెనక్కు తిరిగి ఇంటిముఖం పట్టాడు. దారిలో చిన్న పిల్లలు ఆడుకొనే బాట్, బాల్ కొనుక్కొని వెళ్ళాడు తన ఇంటి ముందున్న కాళీ స్థలంలో నిలబడి రోడ్డు ప్రక్కన ఆడుకొంటున్న పిల్లలను పిలిచాడు .

"ట్రాఫిక్ ఎక్కువగానవున్న రోడ్డు ప్రక్కన ఆడుకోవడం కష్టం. లోనికి రండి మా యింటి ముందు ఆడుకొంటాము " అంటూ తన దగ్గరకు వచ్చిన పిల్లలతో చెప్పాడు. పిల్లలు సంతోషంతో అంగీకరించారు

అక్కడి పిల్లలు సోమయాజులతో అతితక్కువసమయంలో కలసి పోవడంతో వాళ్ళతో చిన్న పిల్లాడిలా ఆడుకొనసాగాడు. కాస్సేపు బాట్ బంతితో క్రికెట్ ఆడారు .

పరుగుపందెం ప్రారంభించారు .సోమయాజులుకు ఒక చిన్న అబ్బాయికి పరుగుపందెం ప్రారంభమైంది. ప్రక్కనున్న ఒక అమ్మాయి వన్ ...టూ ....త్రీ..." అనగానే ఇద్దరూ జోడుగుర్రాల్లా ఒకే వేగంతో పరుగెత్తసాగారు. వీధి దీపాలు వెలిగేంతవరకు ఆడుకొంటూనే ఉన్నారు .పిల్లల తల్లి తండ్రులు వచ్చి పిల్లలను పిలుచుకొని వెళ్ళడానికి వచ్చారు .

" ప్రతిరోజూ సాయంత్రం ఇదే సమయానికి రండి ఆడుకొందాము "అన్నాడు ఉత్సాహంతో

"తాతయ్యా రేపు ఆదివారం. "

" ఆదివారం అన్న సంగతే మరచిపోయాను. ఆదివారం,సెలవురోజులలో ఉదయం నుంచి చీకటి పడేవరకు ఆడుకొందాము." అన్నాడు.

ముసలివారు పిల్లలు జోడుగుర్రాలు అంటూ చెప్పి తన సమస్యకు పరిష్కారం కల్పించిన యోగా గురువు దాసుని మనసులో తలచుకొంటూ ధన్యవాదములు చెప్పుకొన్నాడు. తేలికైన మనసుతో ఇంటిలోనికి వెళ్ళాడు సోమయాజులు.

చాలాకాలం తరువాత ఆ రాత్రి సోమయాజులుకు గాఢ నిద్ర కలిగింది. పాల వాడి కేక వినిపించలేదు, కాలింగ్ బెల్ కొట్టాక మేలుకొన్నాడు

"ఏం సార్ ,ప్రతిరోజూ నేను ఒక చిన్న కేక వెయ్యగానే వచ్చే వారు. ఈ రోజు కాలింగ్ బెల్ మూడుసార్లు కొట్టాను. ఆరోగ్యం బాగోలేదా? " అన్నాడు పాలవాడు

పాలవాడి వైపు చిరునవ్వుతో చూస్తూ రోజూ " ఇక మీదట రోజూ కాలింగ్ బెల్ కొట్టవలసి వస్తుంది " అన్నాడు.

COMMENTS